ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 39.0

కనిష్ఠం : 24.0

బంగారు తల్లులు!

- ఇంటర్ ఫలితాల్లో మెరిసిన బాలికలు
- 'ద్వితీయ'లో 80 శాతం.. 'ప్రథమ'లో 72 శాతం ఉత్తీర్ణత నమోదు
- అట్టర్‌ఫ్లాప్ ఫలితాలతో హైస్కూల్ ప్లస్‌లు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. ఎన్నికల నేపథ్యంలో ఇంటర్ పరీక్షల కోసం సిలబస్‌ను వేగంగా ముగించడం, పరీక్షలను సైతం కొన్ని వారాల ముందుగానే నిర్వహించినప్పటికీ గతేడాది కంటే 8.8 శాతం ఉత్తీర్ణత పెరగడం గమనార్హం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులు మొత్తం 29,346 మంది ఉన్నారు. వీరిలో 27,990 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం బాలబాలికలు పరీక్షలకు హాజరుకాగా 20,936 మంది (75 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరైన 13,120 మందికి 10,355 మంది (80 శాతం), ప్రథమ సంవత్సరం విద్యార్థులు 14,870 మందికి 10,581 మంది (72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఈ ఉత్తీర్ణతలతో జిల్లాకు ద్వితీయసంవత్సరం ఫలితాల్లో 8వ స్థానం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 6వ స్థానం రాష్ట్ర స్థాయిలో లభించింది. రెండేళ్ల ఇంటర్ పరీక్షలు రెండింటిలోనూ బాలుర ఉత్తీర్ణత (69 శాతం) కంటే బాలికలే (79 శాతం) టాప్ స్థానంలో నిలిచారు. ఉత్తీర్ణుల్లో ప్రథమ సంవత్సరం జనరల్‌విభాగంలో బాలికలు 5,550 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,461 మంది ఉండగా, బాలురు వరుసగా 3,871 మంది, 3,750 మంది ఉన్నారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరం బాలికలు 798 మంది, ద్వితీయ సంవత్సరం 741 మంది ఉండగా, బాలురు 362 మంది, 403 మంది ఉన్నారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు బాలురు 12,200 మంది హాజరు కాగా 8,386 మంది, బాలికలు 15,790 మందికి 12,550 మంది విజయ దుందుభి మోగించారు. కాగా సీనియర్ ఇంటర్‌లో జిల్లా టాపర్లుగా ఎంపీసీ విభాగంలో శ్రీపాద సంజన 990/1000 మార్కులు, బైపీసీ విభాగంలో మహ్మద్ సునయన 985/1000, ఆర్.బి.ఎన్.వి.జయశ్రీ 985/1000, ఎంఈసీ విభాగంలో భవిష్యజైన్ 970/1000, సీఈసీ విభాగంలో తమ్మినేని రుషిత 909/1000 నిలిచారు. వీరంతా ఏలూరు శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందినవారు కావడం గమనార్హం.

రీకౌంటింగ్‌కు అవకాశం

జవాబు పత్రాల రీవెరిఫికేషన్/మార్కుల రీకౌంటింగ్ కోసం విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో ఈ నెల 18నుంచి 24లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధి కారి ప్రభాకర రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు మే ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు, థియరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరుగుతాయన్నారు. సప్లిమెంటరీ పరీక్షల కు ఈనెల 24లోగా తాము చదివిన కళాశాలల్లోనే విద్యార్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● ప్రైవేటు కళాశాలలదే పైచేయి..

నీట్, ఎంసెట్, జేఈఈ తదితర పోటీ పరీక్షల దృష్ట్యా ఇంటర్ చదువుకు ప్రైవేటు/కార్పొరేట్ కళాశాలల వైపు విద్యార్థులు, తల్లిదండ్రులు మొగ్గు చూపుతుంటారు. ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య కూడా ప్రభుత్వ కళాశాలలతో పోల్చుకుంటే ఎక్కువగానే ఉంటుంది. ఆ ప్రకారమే ఉత్తీర్ణత, ఫలితాలు ఉంటాయి. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి 22,931 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరుకాగా 17,900 మంది (78.06 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మిగతా అన్ని యాజమాన్యాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి మొత్తం 5,059 మంది పరీక్షలకు హాజరుకాగా 3,036 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ కళాశాలల నుంచి 82 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 70 మంది (85.37 శాతం), ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల నుంచి పరీక్షలకు హాజరైన 548 మందిలో 439 మంది (80.11 శాతం), ఏపీ సోషల్ వెల్ఫేర్ కళాశాలల నుంచి 834 మందికి 652 మంది (78.18 శాతం) ఉత్తీర్ణతలు గవర్నమెంట్ సెక్టార్‌లో టాప్ రిజల్ట్స్‌గా నిలిచాయి.

● హైస్కూల్ ప్లస్‌లు అట్టర్‌ఫ్లాప్

జిల్లాలో ఎంపిక చేసిన జడ్పీ హైస్కూళ్లలో (జడ్పీ జూనియర్ కళాశాలలు) గతేడాది నుంచి ప్రారంభించిన ఇంటర్మీడియట్ విద్య తొలుత నుంచీ ఒడిదొడుకులతో సాగుతున్నట్టుగానే ఫలితాలు కూడా ప్రతిబింబించాయి. గతేడాది ప్రథమ సంవత్సరం పరీక్షల ఫలితాల్లోనే జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌లు అట్టడుగు స్థాయిన నిలిచిన విషయం విదితమే. ఈ ఫలితాలకు కొనసాగింపుగానే ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 349 మంది హైస్కూల్ ప్లస్‌ల నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ పరీక్షలకు 323 మంది హాజరుకాగా కేవలం 103 మంది (31.89 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 212 మందికి 71 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 111 మందికి 32 మంది ఉన్నారు. మండలానికి రెండు హైస్కూల్ ప్లస్‌లు వంతున ప్రారంభించిన ఈ జడ్పీ జూనియర్ కళాశాలలను హడావిడిగా ప్రారంభించడమే తప్ప వీటిలో చేరిన విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందజేయకపోవడం, నిపుణతగల ఫ్యాకల్టీని నియమించడంలో తాత్సారం, సైన్స్ విద్యార్థులకు ల్యాబ్‌లు స్థానికంగా అందుబాటులో లేకపోవడం తదితర వెనుకబాట్లన్నీ ఫలితాలపై ప్రభావం చూపాయి. ఇప్పుడే హైస్కూల్ ప్లస్‌ల పరిస్థితి ఇలాఉండగా, మళ్లీ ఈ ఏడాది కొత్తగా మరిన్ని హైస్కూల్ ప్లస్‌లను తెరవాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం.



శ్రీపాద సంజన ఎంపీసీ (990)



మహ్మద్ సునయన బైపీసీ (985)



జయశ్రీ బైపీసీ (985)

● ప్రభుత్వ కళాశాలల్లో టాపర్లు వీరే..

ప్రైవేటు/కార్పొరేటు కళాశాలలకు దీటుగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల బాలబాలికలు ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో టాపర్లుగా నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో నారాయణపురం ప్రభుత్వ కళాశాల విద్యార్థి హెచ్.అజయ్‌రాజు 985/1000 మార్కులు, పెదపాడు కళాశాల విద్యార్థిని జి.కళ్యాణి 975, కలిదిండి కళాశాల విద్యార్థి వి.కె.వి.వరుణ్ 957 మార్కులు, ఎంఎల్‌టీ గ్రూపులో బుట్టాయిగూడెం కళాశాల విద్యార్థిని ఎస్.కళ్యాణి 961 మార్కులు, సీఎస్ఈ గ్రూపులో నూజివీడు కళాశాల విద్యార్థిని టి.మల్లేశ్వరి 958 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ప్రథమ సంవత్సరం 'ప్రభుత్వ' టాపర్లుగా బైపీసీ గ్రూపులో ఆగిరిపల్లి కళాశాల విద్యార్థిని వి.లావణ్య 422/440 మార్కులు, జంగారెడ్డిగూడెం కళాశాల విద్యార్థిని ఆర్.ఇందుశ్రీ 419 మార్కులు, ఎంఎల్‌టీ గ్రూపులో బుట్టాయిగూడెం కళాశాల విద్యార్థిని వి.కృష్ణప్రియ 478/500 మార్కులు, బుట్టాయిగూడెం విద్యార్థిని సీహెచ్.అర్చన 475, సీఈసీ గ్రూపులో నారాయణపురం కళాశాల విద్యార్థిని పి.సంధ్య 474/500 మార్కులతో శెభాష్ అనిపించుకున్నారు.

● అన్నదమ్ముల్ల ప్రతిభ



అజయ్‌రాజు

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి అయిన కైకరం గ్రామానికి చెందిన హనుమంతు అజయ్‌రాజు 985/1000 మార్కులు సాధించినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్ తెలిపారు. కాగా ఇదే కళాశాలలో చదువుతున్న అతని తమ్ముడు విజయరాజు ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 435 మార్కులు సాధించడం విశేషం.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య



- నూజివీడు నియోజకవర్గ పరిధిలో 22 లొకేషన్‌లలో 60 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించాం. ఇక్కడ పటిష్ఠ భద్ర తా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రహరీలు లేనిచోట్ల బారికేడ్‌లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాం.ఈ ప్రాంతాల్లో స్థానికులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా సీఏఎస్‌ఎఫ్ సిబ్బందితో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.
- నియోజకవర్గంలో 170 మందిపై రౌడీషీట్లు ఉన్నాయి. ఇప్పటికే 147 మంది రౌడీషీటర్లపై బైండోవర్ చేశాం. మిగిలిన వారికి నోటీసులు జారీ చేశాం. ఎన్నికల కేసులున్న 434 మందిని బైండోవర్ చేయగా మరో 144 మందిని చేయాల్సి ఉంది.
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ధనప్రవాహాన్ని అరికట్టేందుకు నూజివీడు నియోజకవర్గంలో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు 8 లక్షల 16 వేలు నగదును స్వాధీనం చేసుకున్నాం. ఆధారాలను సమర్పించి నగదును తిరిగి పొందవచ్చు.
- సచివాలయ మహిళా కార్యదర్శులకు పోలీస్‌శాఖ పరిధిలో ఎటువంటి విధులు అప్పగించలేదు. అయితే ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు ఉంటే సమాచారం ఇవ్వమని కోరాం.
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తున్నాయి. ఇప్పటికైతే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమణలు లేవు. ఎన్నికల ప్రచార అనుమతులపై నిఘా కొనసాగుతోంది.

\- నూజివీడు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్

కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను..

గెలిపించుకుంటాం

- నాయీ బ్రాహ్మణుల మహాసభ శపథం
- బీసీలను గుండెల్లో పెట్టుకుంటాం : పుట్టా

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 12 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులందరిని గెలిపించుకుంటామని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి మహాసభ నాయకులు శపథం చేశారు. ఏలూరు గ్రాండ్ కృష్ణ కన్వెన్షన్ హాలులో నాయీ బ్రాహ్మణ సాధికార సమితి మహాసభ శుక్రవారం నిర్వహించారు. జిల్లా నలుమూలాల నుంచి భారీ సంఖ్యలో నాయీ బ్రాహ్మణులు పెద్దఎత్తున సభకు తరలివచ్చారు. మహేష్ యాదవ్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులు విజయం సాధించే వరకు విశ్రమించబోమంటూ నాయీ బ్రాహ్మణులు నినాదాలు చేశారు. ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు బాటలు వేయగా ఆ అభివృద్ధి చంద్రబాబు నాయుడు కొనసాగించారన్నారు. ఏలూరు ఎంపీగా తనను గెలిపిస్తే బీసీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు. బీసీల ఆర్థికాభి వృద్ధికి కృషి చేస్తామని, ప్రతీ నియోజ కవర్గంలో కమ్యూనిటీ భవనాలు నిర్మి స్తామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ జగన్ కులాల మధ్య చిచ్చు పెడుతున్నాడన్నారు. అధికారంలోకి రాగానే కమ్యూనిటీ హాళ్లకు స్థలాలు కేటాయిస్తామన్నారు. వైసీపీ అరాచకాలను నాయీ బ్రాహ్మణులంతా ప్రజలకు వివరించి ఎన్‌డీఏ కూటమిని గెలిపించాలన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బీసీలకు ఎన్నో పథకాలు అమలు చేస్తే జగన్ అధికారంలోకి రాగానే ఆ పథకాలన్నిటిని రద్దు చేశాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీకృష్ణ, జనసేన నేత ఘంటశాల మహాలక్ష్మి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు శాంతారామ్, చింతమనేని ప్రభాకర్, నవ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు వేమవరప్పాడులో నూతనంగా నిర్మించిన రామాలయం గుడి పునఃప్రతిష్ఠ, అన్నసమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

మాకొద్దు బాబోయ్!


- ఎన్నికల విధుల నుంచి మినహాయింపుల కోసం వినతుల వెల్లువ
- మరోవైపు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు సమీపిస్తున్నా ఓపీఓల నియామకాలే లేవట!



ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నియామకాలకు సంబంధించి పలు అభ్యంతరాలు, పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు గడువు సమీపిస్తున్నా ఓపీఓలకు ఇంతవరకు ఎన్నికల విధుల నియామక పత్రాలు జారీ చేయకపోవడం తదితర సమస్యలు తెరమీదకు వచ్చాయి. ఆ వివరాలను యూటీఎఫ్ జిల్లా నాయకుడు పీ.వీ.నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు పీవో/ఏపీవోల నియామకాలు, నియామక ఉత్తర్వుల జారీ జరిగిందని, వీరందరికీ పోలింగ్ నిర్వహణపై శిక్షణనిస్తున్నారన్నారు. ఎన్నికల డ్యూటీలు పడిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటును వినియోగించుకునేందుకు ఈనెల 14వ తేదీ చివరి గడువుతేదీగా ప్రకటించారని, ఆ మేరకు పోలింగ్ విధుల్లో పాల్గొనే మిగతా సిబ్బంది అయిన ఓపీఓ (అదర్ పోలింగ్ ఆఫీసర్/పోలింగ్ క్లర్క్) విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఇంతవరకు నియామక పత్రాలను జిల్లాలో జారీ చేయనందున ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించే పీవో/ఏపీవోలతో పాటు కనీసం ఇద్దరు నుంచి ముగ్గురు ఉద్యోగుల వరకు క్లర్క్ (ఓపీఓ)లుగా వ్యవహరిస్తారని, వీరు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసే గడువుతేదీ సమీపిస్తోందన్న విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారులు గమనించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఓపీఓలుగా గుర్తించిన ఉద్యోగులకు తక్షణమే నియామక పత్రాలు జారీ చేయడం లేదా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునే గడువు తేదీని పొడిగించడం గాని చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం శారీరక అంగవైకల్యం వున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపులు ఇవ్వాల్సివున్నా జిల్లాలో ఈసీ సూచనలకు విరుద్ధంగా పలు వురికి పీవో/ఏపీవో నియామక పత్రాలు జారీ అయ్యాయని నరసింహారావు ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో మోకాళ్లకు శస్త్రచికిత్సలు, 80 నుంచి 89శాతం అంగవైకల్యం వున్న టీచర్లను పీవో/ఏపీవోలుగా నియమించారని, కొన్నిచోట్ల 70 శాతం అంగవైకల్యం వున్నవారికి మినహాయింపులు ఇచ్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను ఉపాధ్యాయ సంఘాల జేఏసీ సభ్య సంఘాల నాయకులు కలుసుకుని ఎన్నికల విధుల నుంచి మినహాయింపులపై చర్చించారు. ఆ ప్రకారం మంచంపై ఉన్న, వీల్‌చైర్‌పై వున్నవారికి మాత్రమే మినహాయింపులు ఇచ్చినట్టు ఆయన చెప్పారని తెలిపారు. వీటితోపాటు బైపాస్ శస్త్రచికిత్స జరిగి కదలలేనిస్థితిలో వున్న వారికి, శారీరక అంగవైకల్యం వున్న వారు, తీవ్ర అనారోగ్యంతో వున్నవారు వైద్యుడు ధ్రువీకరించిన పత్రాలతో ఓ జాబితాను శనివారం సాయంత్రంలోగా డీఆర్వో కు అందజేస్తామని, వాటిని పరిశీలిం చాలని జేఏసీ నాయకులు అభ్యర్థించారన్నారు. జాబితాలోని ఉద్యోగులు అందజేసిన వైద్య ధ్రువీకరణలను మెడికల్‌బోర్డు స్క్రూటినీ చేస్తుందని, ఈ ప్రక్రియ అనంతరమే మరికొందరికి మినహాయింపులపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ జిల్లా చైర్మన్, కన్వీనర్లతో పాటు, ఏపీటీఎఫ్, యూటీ ఎఫ్, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్-1938 సంఘాల జిల్లా నాయకులున్నారు.

వైసీపీ ఓట్ల వల!

డ్వాక్రా సంఘాలపై ఎత్తుగడలు



సీఎం పాల్గొనే బహిరంగ సభ ఉందంటే అన్ని పనులు పక్కన పెట్టేసి తెల్లవారుజామునే వాహనాలు ఎక్కాల్సిందే. ఎవరైనా మంత్రి వస్తున్నారంటే సంబంధం లేకపోయినా పిల్లాపాపలను ఇళ్ల వద్ద వదిలేసి సమావేశాలకు వెళ్లాల్సిందే. ఎమ్మెల్యేలు ఊరువాడ తిరిగినా, చిన్నాచితకా సభలు పెట్టినా అన్నింటిలోనూ మహిళలే కనిపిస్తారు. వీరంతా డ్వాక్రా గ్రూపు సభ్యులే. ఇదేదో ఇష్టంతో కాదు. అధికారులు, స్థానిక నేతలు... సభలకు వచ్చారా సరేసరి లేకుంటే మీకు వచ్చే పథకాలన్నీ కట్ కట్ అన్న బెదిరింపులే ప్రధాన కారణం. ఎన్నికల వేళ వీరందర్నీ గంపగుత్తగా తమ పార్టీకే ఓటువేసే విధంగా వైసీపీ వర్గాలు వేస్తున్న ఎత్తులు అన్నీ ఇన్నీ కాదు.

\- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ఓటింగ్ సమయానికి తమవైపు చేరేలా ఎత్తుగడలు
- రీసోర్స్‌పర్సన్‌లు, సంఘాల బాధ్యులకు ఇప్పటికే తాయిలాలు
- ఆత్మీయ సమావేశాలు, సభల్లో మహిళలు ఉండేలా జాగ్రత్తలు
- మళ్ళీ మేమే వస్తాం.. గీత దాటితే మీ ఇష్టం అంటూ వార్నింగ్‌లు
- ఇప్పటివరకు ఆర్పీలు, వలంటీర్లదే కీలకపాత్ర

టార్గెట్ అంతా మహిళా సంఘాలే

పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు చాలాకాలంగా కేవలం కుటుంబపరంగా రాణించాలని చూశారు. అప్పులు కాకుండా కుటుంబాల పరంగా నిలదొక్కుకోవాలని ఒకప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఈ డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించి ఆదరించింది. బ్యాంకర్లకు లక్ష్యాలను నిర్దేశించి వీరందరికి రుణం దక్కేలా చూసింది. కలెక్టర్లే స్వయంగా ఈ వ్యవహారాన్ని భుజాన వేసుకుని మహిళా సంఘాలకు రుణాలు సజావుగా సాగేలా బ్యాంకర్ల కమిటీలోనూ దశ,దిశ చేసేవారు. ఎప్పుడైతే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి మహిళా సంఘాల రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పటి ఆదరణ, అభిమానం కోల్పోయి ఆ స్థానంలో బెదిరింపులు మొదలయ్యాయి. అధికార పార్టీ ఏసభ నిర్వహించినా అది పార్టీపరమైనా ప్రభుత్వ పరమైనా సరే డ్వాక్రా మహిళలు హాజరు కావాల్సిందే. ఒకవైపు వలంటీర్లు, మరోవైపు రీసోర్స్‌పర్సన్లు అర్థాంతరంగా వాలిపోవడం ఆరంభమైంది. ఇక చేసేది లేక మహిళలు అంతా ఓసారి ఎక్కడికి రమ్మంటే అక్కడికి పోయి హాజరు వేయించుకుంటే పోలా ఎందుకు ఈ తిప్పలు అనే స్థాయికి చేరారు. ఆఖరికి మంత్రి అయినా, ఎమ్మెల్యే అయినా, స్థానిక నేత అయినా సరే ఎవరు సభలు పెట్టినా, సమావేశాలు పెట్టినా కనిపించేది అంతా డ్వాక్రా సంఘాల మహిళలే. ఏలూరు జిల్లాలోనే సుమారు 20,768 పొదుపు సంఘాలు ఉండగా, వీటిలో 207,680మంది సభ్యులు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 18,370 పొదుపు సంఘాలు ఉండగా, వీటిలో 1,83,700 మంది సభ్యులుగా ఉన్నారు. వీరందర్నీ గడిచిన ఐదేళ్లుగా కీలుబొమ్మలుగా మార్చేశారు. ఒకదశలో మహిళాసంఘాలు వాటిలో సభ్యులు ఆయా కుటుంబాల స్థితిగతులు ఆర్థికపరమైన వనరులు, వీటన్నింటిపైన వలంటీర్ల దగ్గర నుంచి రీసోర్స్‌పర్సన్ల వరకు జల్లెడ పట్టేశారు. అన్నిసంఘాల్లోనూ అధికార వైసీపీ అనుకూలురుదే పైచేయి అయింది. చాలా సంఘాల్లో వీరు చెప్పిందే ఆట, పాడిందే పాట. ఈ దశలో సంఘాల్లో ఉన్న సభ్యులను రాజకీయపరంగా ఏమార్చడానికి ప్రయత్నించారు. దాంతో సరిపెట్టుకోకుండా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే ఆయా సంఘాల మహిళలే అర్హులు. వీరంతా దిగువ స్థాయి కుటుంబాలకు చెందినవారు కావడం, నోరెత్తి ప్రశ్నించలేని తనం ఉండడం, నర్మగర్భంగా ఉండిపోవడం వంటి పరిస్థితులను అధికార వైసీపీకి అనుకూలంగా ఉన్నవారే తమ పార్టీకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఉదాహరణకు మునిసిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో మెప్మాలో సభ్యులుగా ఉన్న మహిళలు అందరిని వైసీపీకి ఓటు వేయాల్సిందిగా అప్పట్లో ప్రేరేపించింది వీళ్ళే. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు రాబోతున్నాయని అవి కూడా మీపేరు మీదే ఉంటాయని, కాదు,కూడదు అని మా మాట జవ దాటితే అవన్నీ ఫట్ అంటూ మరీ బెదిరించారు. దీనికి తోడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక పథకాల ఆరంభానికి బటన్ నొక్కేందుకు జిల్లాలకు వచ్చినప్పుడు మహిళల్నే టార్గెట్‌గా ఎంచుకుని వేలాదిమందిని ఆర్టీసీ బస్సులు, వాహనాల్లోకి తరలించడం చేశారు. ఎవరైనా సమా వేశానికి రామని, డుమ్మాకొట్టేందుకు ప్రయత్నిస్తే బహిరంగం గానే బెదిరించారు. సంఘంలో సభ్యులుగా ఉండరని, ప్రభుత్వ పథకాలు ససేమిరా మీకు అందవంటూ వలంటీర్ల చేత సమాంతరంగా ఈ పొదుపు సంఘాలకు కీలక బాధ్య తల్లో ఉన్న రీసోర్స్‌పర్సన్‌లను ప్రయోగించారు. ఈ ఐదేళ్ళ డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలు పడినపాట్లు అన్నిఇన్నీ కానేకావు.

ఓవైపు ఆర్పీలు.. ఇంకోవైపు వలంటీర్లు

పొదుపు సంఘాల మహిళలతో చెలగాటం ఆడిన వారిలో రీసోర్స్‌పర్సన్‌లు వలంటీర్లు ఉన్నారు. ప్రత్యేకించి డ్వాక్రా సంఘాలు అంటే అవితమ చేతిలోనే ఉన్నట్లు. తాము ఏం చెబితే అదే జరుగుతుందనే భ్రమ కల్పించే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగానే సీఎం జగన్మోహన్ రెడ్డి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు పలుమార్లు వచ్చారు. ఆయన వచ్చిన ప్రతిసారి మండుటెండ అయినా, వానైనా సంఘాల మహిళలంతా తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. ప్రత్యేకించి రీసోర్స్‌పర్సన్, వలంటీర్ దగ్గరుండి మరి ప్రతిగ్రూపులో నుంచి మహిళలు బస్సులు ఎక్కేలా హాజరు వేయించుకున్నారు. సమావేశానికి వెళ్ళి తిరిగి వచ్చేంతవరకు అనుక్షణం నిఘా ఉంచారు. అందుకనే ఇప్పుడు ఎన్నికల్లో మహిళా సంఘాల ఓట్లపై ప్రత్యేక వల విసురుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకమునుపే అధికార సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా మహిళా గ్రూపులను పర్యవేక్షించే రీసోర్స్ పర్సన్‌లను తమ అదుపాజ్ఞలో ఉంచుకున్నారు. వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. మూడో కంటికి తెలియకుండా కొందరికి ఇళ్ల వద్దకే పంపించారు. చేతికి అందిన బహుమానాలతో కొందరు సంతృప్తిపడితే మరికొందరు అధికార పార్టీకి దాసోహం అయ్యారనే విమర్శలు లేకపోలేదు. ప్రతి రీసోర్స్ పర్సన్ (ఆర్పీ) పరిధిలో 25 సంఘాలు ఉంటాయి. వీటిని అదుపుచేసే బాధ్యత ఆర్పీదే. సాధారణంగా ప్రతి గ్రూపునకు ఒక మహిళా లీడర్ అంతా పర్యవేక్షిస్తారు. రుణాలు, చెల్లింపులు ప్రతినెల బ్యాంకులకు సమర్పించేది వీళ్ళే. ఇంకేముంది ముందుగా బహుమతులతో ఆర్పీలను బుట్టలో వేసుకుంటే ఇక సంఘాల్లో మిగిలిన మహిళలను తమ దారికి తెచ్చుకోవాలని, వీరైతే వారికి ఎలక్షన్ బహుమానం ఇంటికి చేర్చే యోచనలో అధికారపార్టీ ఉంది. దీనికి తగ్గట్లుగానే ఇప్పటికే కొన్ని సామాజికవర్గాలకు చెందిన వారు, అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వారు ఈ ఎన్నికల రణరంగంలో తెరవెనుక తమపాత్ర పోషిస్తున్నారు. గడిచిన నెలలో డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలను కలిసి మీ ఆధార్ కార్డులు, ప్రతినెల ఆదాయ మార్గాలు, ఇంటి వ్యవహారాలు నమోదు చేసుకునే ప్రయత్నం చేశారు. ఎందుకని ప్రశ్నించిన వారికి కేంద్రం నుంచి రుణాలు వస్తున్నాయి, అందుకనే ఈ వివరాలు సమర్పించాల్సి వచ్చిందంటూ నమ్మబలికే ప్రయత్నాలు చేశారు.

రాజకీయ ఏజెంట్లుగా వలంటీర్లు..?

ఇప్పుడు ఏం చేస్తున్నారంటే వచ్చే ఎన్నికల్లో కీలక భాగం మహిళలదే కాబట్టి అదికూడా డ్వాక్రా సంఘాల్లో ఉన్నవారిని తమవైపు తిప్పుకోవడానికి అధికారపార్టీ అనేక ఎత్తుగడలకు సిద్ధమవుతోంది. దీనిలో భాగంగానే ప్రత్యేకించి మతపరంగా, అనుకూలత కలిగిన వారిని ఉద్యోగాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని, స్థానికంగా సామాజిక వర్గాల వారీగా ఉన్న నేతలను మహిళా సంఘాలపై వల వేసేలా ఉసికొల్పబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం సాగుతోంది. వలంటీర్లు ఇప్పటివరకు ఈ మహిళా సంఘాలపై పరోక్ష పట్టుబిగించారు. ఇప్పుడు వారంతా రాజీనామాలు చేసినా ఎన్నికల విధుల్లో భాగంగా పార్టీపరంగా రాజకీయ ఏజెంట్లు కాబోతున్నట్లు ఇంకో సమాచారం. అంటే పరోక్షంగా బూత్‌ల్లోనే ఓటర్లు అందర్నీ పరోక్ష సంజ్ఞలతో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేయబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది.



టి.నరసాపురంలో రాజీనామా పత్రాలను పంచాయతీల విస్తరణాధికారి రాంప్రసాద్‌కు అందిస్తున్న వలంటీర్లు

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం టి.నరసాపురం మండలం బంధంచర్లలో తొమ్మిది మంది, ఉంగుటూరు మండలంలో 73 మంది, చాత్రాయి మండలంలో 186 మంది, కలిదిండి మండలంలో 20 మంది, లింగపాలెం మండలంలో ఏడుగురు, భీమడోలు మండలంలో 120 మంది, ముసు నూరు మండలంలో 170 మంది, ఏలూరు రూరల్ మండ లంలో 12 మంది, కైకలూరు మండలంలో 73 మంది, పెద వేగి మండలంలో 46 మంది రాజీనామాలు చేశారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశాం

» పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు



గరగపర్రులో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన వెంకటేశ్వరరావు, తదితరులు

పాలకోడేరు, ఏప్రిల్ 12 : దాళ్వా సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పాలకోడేరు మండలంలో 11వేల 500 ఎకరాలకు గాను ధాన్యం కొనుగోలు చేసేందుకు సంచులను సిద్ధం చేశామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో 90 శాతం 1,121 రకం వరిసాగు చేశారని, ఈ రకం పంట ఎకరానికి 50 నుంచి 52 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం 6,500 సంచులను సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గరగపర్రు, కుముదవల్లి, గొల్లలకోడేరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సూచనలు చేశారు. ఏవో నారాయణరావు, ఎం. స్వరూప, వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు చింతలపాటి సూర్యనారాయణరాజు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

17 కంటే తక్కువగా తేమశాతం ఉండాలి..

ఉండి, ఏప్రిల్ 12 : తేమశాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం చిలుకూరులోని రైతుభరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులంతా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని, అవసరమైన గోనెసంచులు సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నాగరాజు, ఆకివీడు ఏడీఏ శ్రీనివాస్, ఉండి రూరల్ బ్యాంక్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

15న భీమవరంలో సీఎం జగన్ సభ

» ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి

భీమవరం రూరల్, ఏప్రిల్ 12 : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో, సభ ఈనెల 15న భీమవరంలో జరగనున్నట్టు ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి తెలిపారు. భీమవరంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజున కృష్ణా జిల్లా నుంచి భీమవరం వచ్చి రోడ్ షో, సభ అనంతరం తాడేపల్లిగూడెం రోడ్‌షోగా వెళ్తారన్నారు. కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు రంగనాథరాజు, గ్రంధి శ్రీనివాస్, పీవీఎల్ నరసింహరాజు, గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.



టి.వినీల డీడీ సాయిశ్రీనివాస్ లాస్యనందిని సాయినిహారిక మేఘన వర్షిణి

ఇంటర్ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల విజయభేరి

తుని రూరల్, ఏప్రిల్ 12: ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం నుంచి టి.వినీల 1000కి 982, డీడీ సాయిశ్రీనివాస్ 1000కి 980 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా బైపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.లాస్యానందిని 1000కి 979 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఎంపీసీ ప్రథమస్థానం నందు డీవీఎల్ సాయి నిహారిక 470కి 464, ఎస్.మేఘన 470కి 463 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీ ప్రథమ సంవత్సరంనందు జి.వర్షిణి 440కి 428 మార్కులతో అగ్రస్థానంలో నిలిచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

జలవనరుల శాఖ ఎస్ఈగా రవిబాబు

పెదవేగి, ఏప్రిల్ 12 :జలవనరుల శాఖ ఎస్ఈగా ఎంఎస్ఎస్.రవిబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జలవనరుల విభాగంలో పదవీ విరమణ చేసిన ఏలూరు ఎస్ఈ స్థానంలో విజయవాడ ఐఎస్‌డబ్ల్యూఆర్ సీఈగా పనిచేస్తున్న ఎంఎస్ఎస్. రవిబాబును ఏలూరు జిల్లా జలవనరులశాఖ ఎస్ఈగా నియమించారు. అలాగే జలవనరుల శాఖ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సీహెచ్.దేవప్రకాష్‌ను ఏలూరు పీఐపీఆర్ఎంసీ డివిజన్-4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పదవీ విరమణతో ఖాళీ అయిన ఈ స్థానాల్లో నియమించిన అధికారులు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



శ్రీరామాలయంలో ప్రతిష్ఠ చేసిన విగ్రహాలు

కైకలూరు, ఏప్రిల్ 12: రామాలయం జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వేమవరప్పాడులో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనను పుట్టా మహేష్ ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున విచ్చేశారు.

17 నుంచి రఘునాథస్వామి కల్యాణోత్సవాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని రఘునాథస్వామి తిరుకల్యాణ మహోత్సవాలను ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామని దేవదాయ ధర్మదాయశాఖ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ప్రసిద్ధ యదుపురి క్షేత్రంలోని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 17న స్వామివారిని పెండ్లికుమారుడిని చేయటం, 20వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని, 21న స్వామివారికి ఊంజల్ సేవ, హనుమంతవాహనంపై గ్రామోత్సవం, 22న రథోత్సవం, 23న గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 24వ తేదీ శేషవాహనంపై గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

12-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	234.16
జంగారెడ్డిగూడెం-1	243	235	240.28
జంగారెడ్డిగూడెం-2	243	235	239.68
కొయ్యలగూడెం	243	235	239.98
గోపాలపురం	242	235	239.68

తాటి ముంజలకు భలే గిరాకీ

డజను రూ.50 చొప్పున అమ్మకాలు



పాలకొల్లులో ముంజలు విక్రయిస్తున్న గీత కార్మికుడు రమేష్ (ఇన్‌సెట్‌లో) తీసిన ముంజలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 12 : వేసవి వచ్చిందంటే తాటి ముంజలకు గిరాకీ ఉంటుంది. అనేక ఔషధ గుణాలు కలిగి ఉండడంతో పాటు ఎండ వేడిమి తాపాన్ని నివారిస్తుంది. పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో వెలివెలకి చెందిన దింపు కార్మికుడు తంగెళ్ళ రమేష్ తన గ్రామం నుంచి రోజూ ముంజకాయల గెలలను తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. రోజుకు రూ.1500 వరకు ఆదాయం వస్తోందని, మున్సిపల్ పన్నుగా రూ.100 చెల్లిస్తున్నానని, ఖర్చులు పోనూ తనకు సుమారుగా రూ.800 మిగులుతోందని చెప్పాడు. వేసవి సీజన్ అయిన తరువాత కొబ్బరి దింపు, కాయలు వలుపు చేస్తూంటానని చెబుతున్నాడు. కాయ ఒకటికి రూ.10, ముంజలు తీసి ఇస్తే డజను (12) రూ. 50లుకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. వేసవి కావడంతో అనేక మంది వచ్చి కొనుగోలు చేస్తున్నారని, వ్యాపారం బాగుందని తెలిపాడు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలకు బహుమతులు అందించిన పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 12 : ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో ఏజీ సీఏ, ఎంకేటీజే ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర ర్యాపిడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ వట్లూరు సిద్దార్థ ఫెస్ట్ స్కూల్లో శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమ య్యాయి. ఈ పోటీలను రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చదరంగం వల్ల జ్ఞాపకశక్తి, చురుకుదనం, క్రమశిక్షణ అలవడతాయన్నారు. ఈ పోటీలకు పలు జిల్లాల నుంచి 192మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో టి.లక్ష్మణరావు, అభిరామ్, ఎల్.మౌళి, ఎం.బాలశ్రీనివాసరావు, సీహెచ్ వివేక్, ఎం.శ్రీనివాసరావు, ఎల్.అరవింద్‌బాబు, ఎ.అరుణకుమారి, హరీష్, ఎన్.వినయ్, బాలు, సాయికుమార్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని అకాడమి డైరెక్టర్ యోహానస్ తెలిపారు. స్కూల్ వీటీకే సిద్దార్థ కృష్ణ, వంశీకృష్ణ, వై.మహేష్, కనకలక్ష్మి, అరుణ, పి.కిరణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

చెక్‌పోస్టుల్లో ప్రత్యేక బృందాల తనిఖీలు



కృష్ణాపురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులైన కృష్ణాపురం, చాట్రాయి మండలం పార్వతీపురం గ్రామాల్లోని చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేసి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.కోటేశ్వరరావు, మైలవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.భార్గవ, మైలవరం ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు పలువురు అధికారులు చెక్‌పోస్టులను పరిశీలించారు. సరిహద్దు గ్రామాల వెంబడి తనిఖీలు తీవ్ర తరం చేయాలని, ప్రణాళికలపై ఉభయ గోదావరి జిల్లాల అధికారులు చర్చించుకున్నారు.

రూ.3.66 లక్షలు స్వాధీనం : ఎస్పీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 12.35 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 2,240 రూపాయలు అని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు మూడు లక్షల 66 వేల 500 రూపాయలు అని ఎస్పీ తెలిపారు.

మార్కండేయపురం వద్ద రూ.2.36 లక్షలు సీజ్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 12 : ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా మోటార్ సైకిల్‌పై పరిమితికి మించి నగదు తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది అప్పగించారు. జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెంకు ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై రూ.2,36,500 తరలిస్తుండగా మార్గమధ్యలోని మార్కండేయపురం వద్ద శుక్రవారం వాహన తనిఖీల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ నగదును గుర్తించారు. వాటిని లెక్కించి స్క్వాడ్ ఇన్‌చార్జి కేవీ రమణ ఆ నగదును తహసీల్దార్, ఏఆర్‌వో స్వీవజోజికి అప్పగించారు. దాడుల్లో కానిస్టేబుల్ కోటేశ్వరరావు, అబ్బులు, పవన్‌కుమార్, మంగరాజు తదితరులు ఉన్నారు.

ఇద్దరి నుంచి రూ. లక్షా 72 వేలు సీజ్



కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కామవరపుకోట, ఏప్రిల్ 12 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తూరులోని ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి ఒక లక్షా 72 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల అధికారి కె.శేషగిరిరావు తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా బయ్యన్నగూడెంకు చెందిన వ్యక్తినుంచి రూ.85 వేలు, ఏలూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.87 వేలను సరైన ధ్రువపత్రాలు చూపించనందున స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తనిఖీలలో ఏఎస్ఐ వీరాస్వామి, పోలీసులు, వీఆర్‌వోలు తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల ఐదుగురి మృతి

ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల శుక్రవారం మొత్తం ఐదుగురు మృతి చెందారు. ఉంగుటూరు మండలం చింతాయగూడెంనకు చెందిన ఒకరు ఆత్మహత్యకు పాల్పడగా, టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి ఓ యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. ద్వారకాతిరుమల మండలం అనుమాలగూడెం గ్రామానికి చెందిన మరో యువకుడు తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి శివారు గొల్లగూడెం గ్రామంలో ఓ మహిళా వ్యవసాయ కూలీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : ఏ కారణమో తెలియదు కాని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉంగుటూరు మండలం చింతాయగూడెంనకు చెందిన పులపాక ఏసుబాబు(50)కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏ కారణమో తెలియదు కాని శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

టి.నరసాపురం, ఏప్రిల్ 12 : కలుపు మందు తాగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన తడికిమళ్ళ చందు(25) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల చెడు వ్యసనాలకు బానిస కావడంతో తండ్రి వెంకటేశ్ మందలించాడు. మనస్తాపం చెందిన యువకుడు ఈనెల 5న కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ జయకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు..

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన గురజాల శ్యామ్‌బాబు(21) తన స్నేహితుడైన పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మారుమూడి సతీష్ మోటారు సైకిల్‌పై ఈనెల 9వ తేదీన ఏలూరు వచ్చి తిరిగి వెళ్తుండగా చొదిమెళ్ళ ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద మోటారు సైకిల్ నడుపుతున్న సతీష్ ఆకస్మాత్తుగా బ్రేక్‌వేశాడు. వారిద్దరూ కింద పడగా తీవ్ర గాయాలకు గురైన శ్యామ్‌బాబు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

క్రికెట్ బెట్టింగ్ వివాదంతో యువకుడి బలి

» ఇద్దరు వ్యక్తుల దాడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 12: క్రికెట్ బెట్టింగ్ విషయంలో జరిగిన వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఇద్దరు వ్యక్తులు కలసి దాడి చేసి ఓ యువకుడి ప్రాణాలు తీశారు. ఈ ఘటన ద్వారకాతిరుమల పంగిడిగూడెం పంచాయతీ అనుమాలగూడెంకు చెందిన జొన్నకూటి రవి(29) ఈనెల 7న క్రికెట్ ఆడేందుకుగాను మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ మత్తేవారిగూడెంకు వెళ్లాడు. బెట్టింగ్ విషయంలో అదే గ్రామానికి చెందిన గుండుగొంటి మహేష్‌బాబు, గుండుగొంటి బాబులతో గొడవ జరిగింది. ఆ ఇద్దరూ రవిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈనెల ఎనిమిదో తేదీన రవి ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్నాడు. తొమ్మిదో తేదీన అస్వస్థతకు గురవ్వడంతో అతడిని గుంటూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళా కూలీ మృతి



శివమ్మ(ఫైల్)

ఆగిరిపల్లి, ఏప్రిల్ 12: ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి శివారు గొల్లగూడెం గ్రామంలో గత నెల 26న జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలు మృతి చెందిన విషయం విదితమే. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బడుగు శివమ్మ (32) చికిత్స పొందుతూ అవుటపల్లి పిన్నమనేని ఆసుపత్రిలో శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

న్యాయం ఏదీ ?

» ప్రైవేట్ లైన్‌మన్ షణ్ముకం మృతి చెంది నాలుగు నెలలు

» నేటికీ ఆ కుటుంబానికి అందని సాయం

» బాధ్యుల్ని కాపాడేందుకు ప్రయత్నాలు



షణ్ముఖం(ఫైల్)

నరసాపురం, ఏప్రిల్ 12: నరసాపురం పట్టణంలో ప్రైవేట్ లైన్‌మన్ షణ్ముఖం అంటే తెలియని వారు ఉండరు.. ఎవరి ఇంట్లోనైనా కరెంట్ పోతే ముందుగా కరెంట్ ఆఫీసుకు కాకుండా అతడికే ఫోన్ చేస్తారు.. సేవే లక్ష్యంగా పని చేస్తాడని మంచి పేరుంది. తమిళనాడు నుంచి వచ్చిన స్థిరపడిన అతని సేవల్ని ఎక్కువగా ఈపీడీసీఎల్‌లోనే సిబ్బంది ఎక్కువగా వినియోగించుకున్నారు. కొంతమంది వైట్‌కాలర్ సిబ్బంది అతడిని అడ్డం పెట్టుకుని ఉద్యోగులుగా చలామణీ అవుతూ వస్తున్నారు. జీతంలో కొంత మొత్తాన్ని అతడికి ఇస్తూ దర్జాగా గడిపేసేవారు. గత ఏడాది డిసెంబరులో ఒక కొత్త విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు వెళ్లిన అతడు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ విషయాన్ని బయటకు రాకుండా ఏలూరు తరలించి చికిత్స చేయించినప్పటికీ మృతి చెందాడు. అప్పట్లో అతడి మృతి పట్టణంలో పెద్ద సంచలనమైంది, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని చాలామంది విశాఖలోని ఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. సంఘటన జరిగి నాలుగు నెలలు గడిచినప్పటికీ ఆ కుటుంబానికి ఎటువంటి పరిహారం అందలేదు. బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు లేవు. ఇంకా విచారణ పేరుతోనే కాలయాపన చేస్తున్నారు. ఈ వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ ఈపీడీసీఎల్ అధికారి బాధ్యులైన ఉద్యోగులను కాపాడుతున్నాడన్న గుసగుసలు ఆ శాఖలోనే వినిపిస్తున్నాయి. దీనికంటే వెనుక జరిగిన నరసాపురం మండలం కె.బేతపూడి ప్రైవేట్ లైన్‌మన్ మృతికి బాధ్యుడిగా చూపించి కొప్పర్రు లైన్‌మన్‌ను సస్పెండ్ చేశారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించారు. నిస్వార్థంగా పేరు సంపాదించిన షణ్ముఖం కుటుంబానికి మాత్రం న్యాయం జరగలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు కళ్లు తెరుస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

భార్య, చిన్నారి మృతదేహాల లభ్యం



యోచన, నిధిశ్రీ మృతదేహాలు

యలమంచిలి, ఏప్రిల్ 12: భీమవరానికి చెందిన బొంతు కిషోర్‌కుమార్ కుటుంబం బుధవారం గోదావరిలో దూకి ఆత్మహత్యకు చేసుకున్న ఘటనలో మూడో రోజు శుక్రవారం పోలీసులు గోదావరిలో గాలింపు చర్యలు కొనసాగించారు. సోంపల్లి సమీపంలో భార్య బొంతు యోచన, రెండేళ్ల కుమార్తె నిధిశ్రీ మృతదేహాలు లభ్యమయ్యాయి. భర్త కిషోర్‌కుమార్ మృతదేహం గురువారం లభ్యమైన విషయం విదితమే.. ఆర్థిక ఇబ్బందులు కారణంగా రెండేళ్ల పసిపాపతో కలిసి భార్యభర్తలు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడడం పలువురిని కలచివేసింది.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తణుకు, ఏప్రిల్ 12 : తణుకు పట్టణ పరిధిలోని ఇరిగేషన్ కార్యాలయం సమీపంలోని పాడుబడ్డ భవనాల వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్ల ఉంటుందన్నారు. మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుందని, శరీరంపై బట్టలు లేవన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు

ఆకివీడు, ఏప్రిల్ 12: తన తండ్రి అదృశ్యమయ్యాడని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ జి.దివాకర్ తెలిపారు. కుప్పనపూడికి చెందిన కట్రెడ్డి రామారావు(63) గురువారం రాత్రి గుమ్ములూరు సెంటర్‌కు వెళ్లి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ లేదన్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం.. పోక్సో కేసు

టి.నరసాపురం, ఏప్రిల్ 12 : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామంలో రెండో తరగతి చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి చీమలు తొలగిస్తానని చెప్పి ఇంటికి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. బాలిక శరీరంపై గాయాలు గుర్తించిన ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

టెక్నోఫెస్ట్‌లతో విద్యార్థులు ప్రతిభ చాటాలి

» వీసీ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: టెక్నోఫెస్టల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభ చాటేందుకు సిద్ధంగా ఉండాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ వీసీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో టెక్ జెట్-24 జాతీయ స్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్టును శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ నాణ్యమైన, విభిన్నమైన విద్యను అందిస్తోందని, మానవ సంక్షేమం కోసం నూతన విషయాలను ఆవిష్కరించటానికి విద్యార్థులు సాంకేతికతలో మార్పులను నేర్చుకుంటూ నూతన విషయాలను ఆవిష్కరిస్తూ ముందుకు సాగాలన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ వేగంగా మారు తున్న సాంకేతికతను, నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి టెక్నాలజీ రేసులో పరిగెత్తాలన్నారు. ఈ సందర్భంగా టెక్నో జెట్‌లో 1,171 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నట్టు టెక్ జెట్ కన్వీనర్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్ తెలిపారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ-టెక్‌జెట్‌లో 12 వర్క్‌షాపులతో పాటు 33 టెక్నికల్ ఈవెంట్‌లు నిర్వహిస్తామన్నారు. ప్రొఫెసర్ గోపాలరాజు, రిజిస్ట్రార్ బి.శ్రావణి, డీన్ బి.శ్రీనాథ్, ఫైనాన్స్ ఆఫీసర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

» ఏలూరు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి వరప్రసాద్



ఏలూరు రూరల్, ఏప్రిల్ 12: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు భద్రాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్ సర్వీసులు నడపనున్నట్టు ఏలూరు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎన్.వి.ఆర్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రుల కల్యాణానికి వెళ్లే భక్తుల కోసం ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేకబస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒక ఊరునుంచి 50 మంది వెళితే ఆ ప్రదేశంనుంచి ప్రత్యేక సర్వీస్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరింత సమాచారానికి దగ్గరలోని డిపో మేనేజరును సంప్రదించవచ్చన్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే సీతారాముల కల్యాణాన్ని భక్తులు కన్నులారా వీక్షించి క్షేమంగా ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించాలని తెలిపారు.

26 అనధికార మద్యం సీసాల స్వాధీనం

» చిన్నంపేటకు చెందిన వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ అధికారులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 26 అనధికార మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ సీఐ వెంకట రమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన దాడుల్లో చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన శ్యామల వెంకటేశ్వరరావు అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి మొత్తం 26 మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నట్టు తెలిపారు. అలాగే నూజివీడు మండలం సిద్దార్థనగర్ తండాలో నిర్వహించిన దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నామన్నారు. రేగుంటలో 50 లీటర్ల సారాను స్వాధీన పరుచుకుని వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు తెలిపారు.

ఎస్ఈబీ విస్తృత దాడులు



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా, బెల్లపు ఊట

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు విస్తృతంగా దాడులు చేపట్టారు. నూజివీడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి 70 లీటర్ల నాటుసారా, 2,200 లీటర్ల బెల్లపు ఊటను, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ సారా బట్టీ నిర్వాహకులను గుర్తించారు. సిద్దార్థ నగర్ తాండా ప్రాంతంలో 1,200 లీటర్ల బెల్లపుఊట, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. రేగుంట గ్రామంలో 50 లీటర్ల నాటుసారా, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిందితులపై కేసులు నమోదు చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు.

వ్యవస్థలన్నీ నిర్వీర్యం : బడేటి చంటి



వైసీపీ అరాచకాలు వివరిస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 12: రాష్ట్రంలో వ్యవస్థలన్నిటిని నిర్వీర్యం చేసిన అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర 31వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించారు. చంటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావల్సిన అవశ్యకత ఉందన్నారు. ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించాలని చంటి విజ్ఞప్తి చేశారు. శివప్రసాద్, కాశీనరేష్, కార్పొరేటర్ పృధ్వీ శారధ, నాయుడు సోము, ధుళిపూడి రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 2వ డివిజన్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. శనివారపుపేట, హైస్కూల్‌లో ప్రజాగళం కార్యక్రమం జరిగింది. ఉమ్మడి పార్టీల అభ్యర్థులు, నాయకులు ఈశ్వరి, బలరామ్, గాది రాంబాబు, నాగం శివ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం యువత టీడీపీలో చేరిక

నగరంలో వందలాది మంది ముస్లిం యువత టీడీపీలో చేరారు. బడేటి చంటి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. అబ్దుల్ కరీం, మహ్మద్ ఫయాజ్, ఖాలిక్, ముహ్మద్ అలీ పాల్గొన్నారు.




టీడీపీలో చేరిన ప్రత్తికోళ్లలంక గ్రామస్తులు, పథకాలు వివరిస్తున్న రాధారాణి

మహిళల సంక్షేమానికి సూపర్ సిక్స్ పథకాలు

పెదవేగి, ఏప్రిల్ 12: మహిళల సంక్షేమానికి సూపర్ సిక్స్ పథకాలు దోహదపడతాయని చింతమనేని వెంకట రాధారాణి అన్నారు. చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి బాపిరాజుగూడెంలో శుక్రవారం ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బొప్పన సుధాకర్, సర్పంచ్ జోగి పెద పెంటయ్య, ఎంపీటీసీ మద్దాల సహదేవుడు, తలకొండ జమలయ్య, బొప్పన మార్కండేయులు, జోగి సత్యవతి, ఫులిచర్ల రాధిక, తాళం సూర్యావతి, వెలివెల వాణి, అత్తిలి సోమేశ్వరమ్మ, చలమాల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన కొల్లేరు రాజన్న కమిటీ ప్రధాన కార్యదర్శి ఘంటసాల పాండురంగారావు, భలే గంగరాజు, సైదు ధర్మరాజు, భలే యశ్వంత్, మోరు రాజు, ఘంటసాల ప్రశాంతి, భలే కుమారి సహ పలు కుటుంబాలు వైసీపీని వీడి చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. కొల్లేరు గ్రామాల సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో టీడీపీలో చేరినట్లు వారు వివరించారు.



వడ్డెరగూడెంలో మాట్లాడుతున్న సొంగా రోషన్‌కుమార్

తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక : రోషన్

చింతలపూడి, ఏప్రిల్ 12: తెలుగుదేశంపార్టీకి బీసీలే వెన్నుముక అని, వారి కోసం చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ప్రకటించారని కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో వడ్డెరగూడెం, బట్టువారిగూడెంలో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు వివరించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నారాయణ లాండ్రీ వద్దకు వెళ్లి కొద్దిసేపు బట్టలు ఇస్త్రీచేసి బీసీలకు న్యాయం తెలుగుదేశం వల్లే జరుగుతుందని అక్కడ ప్రజలకు వివరించారు. అనంతరం బీసీ జయహో సభలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల్లో 50 ఏళ్ల వారికి పెన్షన్ ఇస్తుందన్నారు. మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సుప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తుందని సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ప్రచార ర్యాలీలో జె.ముత్తారెడ్డి, పక్కాల వెంకటేశ్వర రావు, చిట్లూరి ధర్మరాజు, అట్లూరి శ్రీనివాసరావు, కె.రాజశేఖర్‌రెడ్డి, చీదరాల మధుబాబు, పి.విజయ్‌కుమార్, రాజారత్నం, బోడా భూషణం, టి.రామారావు, వెంకట్రాజు, కొమ్మరాజు సత్యనారాయణ, నాంచారయ్య తదితరులు భారీగా పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు స్ఫూర్తి బీఆర్ అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సంతోష్‌కుమార్

పెదవేగి, ఏప్రిల్ 12: భారత రత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అని ఎస్సీ సర్పంచ్‌ల రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. అంకన్నగూడెంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గనిర్దేశకుడని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తే ఉన్నత స్థానం చేరుకుంటారన్నారు. యువత ఆదర్శమూర్తుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఎత్తుకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో తూమాటి కాంతారావు, పొనుగుమాటి లక్ష్మణ్, రాములు, వెంకన్న, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత సదస్సును జయప్రదం చేయండి



టెక్కినవారిగూడెంలో మాట్లాడుతున్న రాజ్‌పాల్‌కుమార్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 12 : ఏలూరులో జరిగే టీడీపీ దళిత సదస్సును జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ కోరారు. శుక్రవారం లక్కవరం, నిమ్మలగూడెం, టెక్కినవారిగూడెం, పంగిడిగూడెం, పేరంపేట గ్రామాల్లో దళిత నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 17న ఏలూరు పొగాకు వర్తకుల సమావేశ మందిరంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగే టీడీపీ దళిత సదస్సును జయప్రదం చేయాలని కోరారు. దళితులందూ ఐక్యంగా కూటమి విజయానికి కృషి చేయాలన్నారు. పుట్టా మహేష్ కుమార్ యాదవ్, సొంగ రోషన్ కుమార్‌ను అత్యధిక మెజారిటీ సాధిస్తారన్నారు. గద్దె బాబీ, అయ్యప్ప, లింగాల సత్యనారాయణ, అందుగుల మోహనరావు, మాండ్రు ఏసు, మానుకొండ కుటుంబరావు, మద్దిపాటి ఉదయ్, జొన్నకూటి శ్రీనివాసరావు, దిద్దే దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో అప్రమత్తంగా ఉండాలి



కొనుగోలు కేంద్రం పరిశీలించిన వ్యవసాయ శాఖ జేడీ

ఉంగుటూరు, ఏప్రిల్ 12: ధాన్యం సేకరణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.కే.హబీబ్ బాషా సంబంధిత అధికారులను కోరారు. రైతులకు కావలిన సంచులు, రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం యంత్రంపై రైతులకు అవగాహన కల్పించి ధాన్యం సేకరణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో బాలిన వెంకటేష్, టెక్నికల్ ఏవో ఎస్.ప్రవీణ్ రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ బ్రాహ్మణులకు చేసిందేమీ లేదు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 12: వైసీపీ ప్రభుత్వం బ్రాహ్మణులకు చేసిందేమీ లేదని టీడీపీ బ్రాహ్మణ సాధికర కమిటీ జిల్లా కన్వీనర్ ఎంబీఎస్ శర్మ అన్నారు. బ్రాహ్మణ సాధికారత కమిటీ కార్యాలయంలో శుక్రవారం శర్మ మాట్లాడుతూ ఈ నెల 13న ఆర్‌ఆర్.పేట వెంకట్రామ కల్యాణ మండపంలో బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి, ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్ పాల్గొంటారన్నారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యర్రంపల్లిలో కొనసాగుతున్న వైద్యశిబిరం

చింతలపూడి, ఏప్రిల్ 12: యర్రంపల్లిలో వైద్యశిబిరం కొనసాగుతోంది. గ్రామాల్లో జ్వరాల తీవ్రతవల్ల వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఇంటింటి సర్వే జరిపి జ్వరాలపై అవగాహన కల్పించారు. రాఘవాపురం వైద్యాధికారి కిరణ్‌చైతన్య మాట్లాడుతూ నలుగురి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామని చెప్పారు. అధికారులు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న బొరగం



జంగారెడ్డిగూడెం సమావేశంలో దాసరి శేష



పోలవరంలో చిర్రి బాలరాజు ర్యాలీ

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 12: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం బొరగం అధ్యక్షతన శుక్రవారం జరిగింది. జగన్ రెడ్డి రాక్షస పాలనకు చమరగీతం పాడాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా పోలవరం నియోజకవర్గంలో జనసేన పోటీ చేస్తుందన్నారు. అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. త్వరలోనే ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల్లో విజయానికి కార్యచరణ రూపొందించి ముందుకు వెళతామన్నారు. శీలం వెంకటేశ్వరావు, పారేపల్లి రామారావు, మొగపర్తి సోంబాబు, ఎం.నాగేశ్వరావు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, పారేపల్లి నరేష్, అమరవరపు ఆశోక్, గద్దె అబ్బులు, చింతల వెంకటమరణ, జారం చాందినీ విద్యాసాగరిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు వివరించాలి

జంగారెడ్డిగూడెం: సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంట అవగాహన కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేష అన్నారు. టీడీపీ మండల సమావేశం సొంగా రోషన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. శంఖారావం, జయహో బీసీ కార్యక్రమాలు, ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు, వలంటీర్లకు నెలకు రూ.10వేల వేతనం, రూ.4వేలు పెన్షన్ ప్రతి ఇంటికి చేరవేయాలని సూచించారు. కుక్కల మాధవరావు, బుసా సత్యనారాయణ, గొల్లమందల శ్రీనివాస్, ఎలికే ప్రసాద్, గోలి అనిల్, దండే పద్మ, గంటా రామారావు, లింగాల సత్యనారాయణ, పొల్నాటి సత్యనారాయణ, ఉండవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ విజయం కోరుతూ 27 వార్డులోని మొడియం లక్ష్మణ్ నగర్, డాంగే నగర్, సీతానగర్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

టి.నరసాపురం: పోలవరం నియోజకవర్గం అభ్యర్థి విషయంలో చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం టీడీపీ నాయకులు జయ్యవరపు శ్రీరామమూర్తి, నల్లూరి వెంకట చలపతిరావు తెలిపారు. నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యకర్తలందరూ పొత్తు ధర్మాన్ని పాటించి కూటమి అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొడియం సూర్యచంద్రరావు, మేఘలాదేవి, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, రాజాబాబు, అక్కిశెట్టి బలరామ్, నాళం కాశీ, కొల్లి రమేష్, అద్దంకి జగ్గారావు, ఘంట సతీష్, అనుమోలు సంధ్యారాణి, పెద్దిన సత్యనారాయణ, చంద్రశేఖర్, భీమవరపు జగన్మోహనరావు, కాకర్ల సురేష్, జ్యేష్ట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వట్టి వసంత్ అభిమానులతో ధర్మరాజు సమావేశం

భీమడోలు: మండలంలో మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ అభిమానులతో శుక్రవారం రాత్రి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు సమావేశమయ్యారు. వసంత్ అభిమానులు కలిసికట్టుగా ధర్మరాజుకు మద్దతివ్వాలని వట్టి వారసుడు పవన్ వివరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి మాట్లాడుతూ మూడు పార్టీల కూటమి సభ్యులు కలసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పోలవరంలో చిర్రి బాలరాజు ర్యాలీ

పోలవరం: మండలంలో టీడీపీ బీజేపీ జనసేన కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు స్థానిక నాయకులతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత పాత పోలవరంలో గ్రామదేవత కడమ్మ తల్లికి పూజలు నిర్వహించి బైకులతో ఓపెన్ టాప్ వాహనంపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అభివాదం చేశారు. కార్యక్రమంలో స్థానిక జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





ఉంగుటూరులో మాట్లాడుతున్న ఆర్వో ఖాజావలి, చింతలపూడిలో పీవో, ఏపీవోలు, వీవీ ప్యాట్‌పై శిక్షణ ఇస్తున్న ఏలూరు నియోజకవర్గ ఆర్వో ముక్కంటి

నామినేషన్ దాఖలుపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 12: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలులో జాగ్రత్తలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎస్‌కే ఖాజావలి సూచించారు. నామినేషన్ దాఖలుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులు నామినేషన్ పత్రంలో ఇద్దరు ప్రపోజర్లను, గుర్తింపు పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థి అయితే పది మంది ప్రపోజర్ల సంతకాలతో దరఖాస్తును ఎన్నికల అధికారికి అందించాలని ఖాజావలి తెలిపారు. దరఖాస్తు ఫారం సక్రమ పద్ధతిలో అందించాలని, దరఖాస్తు రుసుం ఎన్నికల నియమావళి ప్రకారం అందించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాల ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఖాజావలి సమక్షంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో తహసీల్దార్లు కట్టా వెంకట శివయ్య, మాస్టర్ ట్రైనర్లు శీతాల సత్యనారాయణ, శిరిమామిళ్ల పెద్దిరాజు,రాంబాబు,హరికృష్ణ పాల్గొన్నారు.

● చింతలపూడి: నియోజకవర్గంలో పోలింగ్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూళ్లలో తొలిరోజు శిక్షణలో 312మంది పాల్గొన్నారు. 9మంది మాస్టర్ ట్రైనర్స్ రిపోర్ట్స్, ఈవీఎంల వినియోగం, ఓటింగ్, పోలింగ్ అధికారుల విధులు, పోస్టల్ బ్యాలెట్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల అధికారి కె.అద్దయ్య సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ పర్యవేక్షించారు. తొలిరోజు శిక్షణకు 312 మంది పీవోలు, ఏపీవోలు హాజరయ్యారని, శనివారం కూడా ఈ శిక్షణ కొనసాగుతుందని గోపాలకృష్ణ తెలిపారు.

● ఏలూరు సిటీ: ఎన్నికల నిర్వహణలో పీవోలు, ఏపీవోలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఏలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ అనంతరం కస్తూరిబా పాఠశాలలో ఈవీఎంల నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు ముక్కంటి తెలిపారు. ఈవీఎంల వినియోగం, మాక్ పోలింగ్, ఇతర సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 12: ఉపాధిహామీ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశంలో ఎ.రవి, సీఐటీయూ జిల్లా నాయకులు టి.కిషోర్ తదితరుల బృందం శుక్రవారం పర్యటించింది. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికసంఘ పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ పథకం సాధించుకున్నామని గుర్తు చేశారు. ఈ పథకానికి కేంద్రం తూట్లు పొడుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 100 రోజుల పనికి రెండున్నర లక్షల కోట్లు అవసరం ఉంటే కేవలం రూ.63 వేలకోట్లు కేటాయించి చేతులు దులుపుకుంటుందన్నారు. రాష్ట్రప్రభుత్వం పనిప్రదేశాల్లో పనిముట్లు, మజ్జిగ తదితర సౌకర్యాలు అన్ని కత్తిరించిందన్నారు. వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గ్రూపు-2 ప్రిలిమ్స్ ఉత్తీర్ణులను అభినందిస్తున్న పీవో సూర్యతేజ

గ్రూపు-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత

బుట్టాయగూడెం, ఏప్రిల్ 12: ఏజెన్సీ ప్రాంతానికి చెందిన 9 మంది గిరిజన విద్యార్థులు ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూపు-2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేఆర్.పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో వైటీసీలో 70 మంది గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పొందినవారిలో 9 మంది ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు ఎంపికయ్యారని ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను తన ఛాంబరులో అభినందించారు. అందరూ ఉద్యోగాలు పొందాలని మెయిన్స్ పరీక్షకు కూడా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో పీవీఎస్.నాయుడు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



గుర్రం కళ్యాణి, ఆనం చంద్రశేఖర్

పెదపాడు, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ గొట్టాపు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీసీ గ్రూపులో 975 మార్కులతో బాలికల విభాగంలో గుర్రపు కళ్యాణి ప్రథమ, 844 మార్కులతో ఆనం చంద్రశేఖర్ ద్వితీయ స్థానాలు సాధించారు. కళ్యాణి విట్ కళాశాలలో ఉచిత ఇంజనీరింగ్ సీటు సాధించినట్లు సుబ్రహ్మణ్యం చెప్పారు. మొదటి సంవత్సరం 56 శాతం, ద్వితీయ సంవత్సరం 79 శాతం ఉత్తీర్ణత, ఒకేషనల్ గ్రూపులో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



పి.సంధ్య, పి.ప్రశాంతి




జి.హాసిని, హెచ్.విజయరాజు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనిబరిచారని ప్రిన్సిపాల్ బీవీ.శ్రీనివాస్ తెలిపారు. ఎంపీసీ (ద్వితీయ)లో కైకరం గ్రామానికి చెందిన హనుమంతు అజయ్‌రాజు 985 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 70 మందికి 42 మంది, ద్వితీయ సంవత్సరం 64 మందికి 44 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో జి.హాసిని 931 మార్కులు, హెచ్ ఈసీలో పి.భారతి 901 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్మీ డియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో హనుమంతు విజయరాజు 435 మార్కులు, బైపీసీలో ఎం.హర్షిత 400 మార్కులు, సీఈసీలో పి.ప్రశాంతి 456 మార్కులతో కళాశాల టాపర్లుగా నిలిచారు.

ఐటీడీఏ పరిధి కళాశాలల్లో 87 శాతం ఉత్తీర్ణత

బుట్టాయగూడెం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో విద్యార్థులు 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పీవో ఎం.సూర్యతేజ, డీడీ పీవీఎస్ నాయుడు తెలిపారు. మొదటి సంవత్సరంలో 75.7 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బూసరాజుపల్లి గురుకుల బాలికల కళాశాలలో సెకండియర్ 94.7 శాతం, ఫస్టియర్ 92 శాతం ఉత్తీర్ణత సాధించా రని, కేఆర్.పురం గురుకుల బాలుర కళాశాలలో సెకండియర్ 86.8 శాతం, ఫస్టియర్ 71.1 శాతం, జీలుగుమిల్లి గురుకుల బాలుర కళాశాలలో సెకండియర్ 75.76 శాతం, ఫస్టియర్ 54.8 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ 64 శాతం ఫస్టియర్ 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.కుసుమ తెలిపారు.

కుక్కునూరు మండలంలో..



కె.పల్లవి

కుక్కునూరు: మండలంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 79 శాతం, ద్వితీయ సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కుక్కునూరు, వేలేరుపాడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి సంవత్సరం 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 65 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 62 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 39 మంది ఉత్తీర్ణులయ్యారు. కుక్కునూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కె.వర్ష బైపీసీ విభాగంగా 909 మార్కులు, ఎస్.పూజిత బైపీసీలో 890 మార్కులు సాధించారు. కుక్కునూరు గ్రామానికి చెందిన పల్లవి బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటిసంవత్సరం నర్సింగ్ విభాగంలో 500 మార్కులకు 466 మార్కులు సాధించింది. దీంతో ఆమెను ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, సర్పంచ్ రావు మీన అభినందించారు.

ఎన్నారై విద్యార్థుల విజయదుందుభి

ఏలూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఎన్నారై జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబరిచారని కళాశాల సీఈవో వి.తులసీరామ్ తెలిపారు. 98.06శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఎం.మహిమ 987మార్కులు, సాయిదీక్షిత్ 983, సాయికృష్ణ 980, బైపీసీ గ్రూపులో ప్రణవ్ 989మార్కులు సాధించారని వివరించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో లాస్యశ్రీ 465, సత్యసాహితి, అఫీఫా, ప్రభాకరరావు 464, బైపీసీ గ్రూపులో హడస్సా 432, చార్మి, అభిరమ్యశ్రీ 430మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఏలూరు శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల ఏజీఎం వీవీ.రాంబాబు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో శ్రీపాద సంజన 990 మార్కులతో ఏలూరు టౌన్ ఫస్ట్‌గా నిలిచిందని వివరించారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎండి.సునయన, ఆర్.జయశ్రీ 985 మార్కులు, ఎంఈసీ గ్రూపులో భవిష్యజైన్ 970, సీఈసీ గ్రూపులో టి.రుషిత 909మార్కులతో టాపర్లుగా నిలిచారని వివరించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బొడ్డు హర్షిత, మురళి ఊహ 465, బైపీసీలో ఎండి.సమీష 435, ఎంఈసీలో వి.చైతన్యశ్రీ 486, సీఈసీలో సీహెచ్.మీనాక్షి 468మార్కులు సాధించారని తెలిపారు.



ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

పారదర్శకంగా ఈవీఎం ర్యాండమైజేషన్ : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 12: పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జేసీ లావణ్యవేణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు (బీజేపీ), ఎస్‌బీ ప్రసాద్ (కాంగ్రెస్), ఉండవల్లి బాలానందం (టీడీపీ), డి.సూర్యచంద్రరావు (వైసీపీ), ఎన్.కాశీనరేష్ (జనసేన) తదితరులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో 1,743 పోలింగ్ కేంద్రాలకు 4,184 బ్యాలెట్ యూనిట్లు, 4,184 కంట్రోల్ యూనిట్లు, 4,534 వీవీప్యాట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు 20 శాతం, వీవీ ప్యాట్లు 30 శాతం అదనంగా కేటాయిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా ర్యాండమైజేషన్ చేశామన్నారు. డీఆర్వో పుష్పమణి, నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలి



సాయుధ దళాల కవాతు

లింగపాలెం, ఏప్రిల్ 12: ధర్మాజిగూడెం, లింగపాలెం గ్రామాల్లో శుక్రవారం సాయుధ దళాలు కవాతు నిర్వహించాయి. సీఐ ఎం.సుధాకర్, ఎస్సై పి.చెన్నారావు ఆధ్వర్యంలో గ్రామాల్లో సాయుధ దళాలతో కవాతు నిర్వహించారు. సీఐ సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అలజడులు సృష్టించరాదని, ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పాటిమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారికి బోనాలు,పుట్టింటి సారె

దెందులూరు, ఏప్రిల్ 12: చల్లచింతలపూడి గ్రామ దేవత పాటిమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టు చైర్మన్ యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత పెరుగుగూడెం యలమర్తి వారి ఇంట నుంచి పసుపు, కుంకుమ, సారె, బోనాలను, 116 కళశాలతో జలాలను మహిళలు భారీ ఊరేగింపుగా తీసుకెళ్లాను. పాటిమ్మ తల్లికి జలం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అవరణలో అన్నదానం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు వెండి చీర బహూకరణ



కనకదుర్గమ్మకు వెండి చీర

బుట్టాయగూడెం, ఏప్రిల్ 12: రెడ్డిగణపవరం కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కనక దుర్గమ్మకు నడిపల్లి నారాయణరావు, లక్ష్మీ, పెనుమత్స వెంకట రామరాజు, కీర్తి దంపతులు 1.6 కేజీల వెండి చీరను శుక్రవారం బహూకరించారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పెరున్న అమ్మవారికి చీరను సమర్పించారు. వారిని ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు, ఆలయ కమిటీ చైర్మన్ భౌమరాజు సత్యనారాయణరాజు కమిటీ సభ్యులు అభినందించారు.

నూకాలమ్మ ఆలయం వద్ద పది వేల మందికి అన్నదానం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 12 : నూకాలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం నిత్య పూజా కైంకర్యాలు అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయం వద్ద పది వేల మందికి భారీ అన్న సమారాధన చేశారు. అన్న సమారాధనకు గొట్టుముక్కల వంశీ కుమార్ రాజు రూ. 25,116, వాగ్వాల పుల్లారావు, కూరగాయలు వర్తక సంఘం సభ్యులు కూరగాయలు, నౌడు నూకరాజు, సమర్పించారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు.

ఫాతిమాపురంలో మంచినీటి కొరత

చింతలపూడి, ఏప్రిల్ 12: ప్రగడవరం పంచాయతీ ఫాతిమాపురంలో మంచినీటి కొరతతో గ్రామస్థులు అల్లాడుతున్నారు. పది రోజులుగా ఎండ తీవ్రతకు మంచినీరు అందక అవస్థలు పడుతున్నారు. ఫాతిమాపురం ఎగువభాగంలో గృహవాసులకు మంచినీరు అందడం లేదు. పంచాయతీ బోరు ఉన్నా సాధారణ రోజుల్లోనే ఇబ్బందులు తప్పడం లేదు. వేసవిలో అవికూడా రావడం లేదని ఎగువ భాగం గ్రామస్థులు చెప్తున్నారు. తాము సమీపంలోని రైతుల తోటల్లోకి వెళ్ళి నీరు తెచ్చుకుంటున్నామని, మంచినీటి కొరత తీర్చటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపు దెందులూరులో ఆయుష్ వైద్య శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో దెందులూరు బిషప్ జాన్ మెమోరియల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం ఒంటిగంటవరకు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి తెలిపారు. వైద్యులు డి.వెంకట జయదీప్, భాను కిరణ్ తదితరులు పాల్గొంటారని వివరించారు. ఫైబ్రోస్కాన్ పరీక్ష, రక్తపోటు, మధుమేహం, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. ముందుగా 84669 95800, 84669 96552లో సంప్రదించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **పెదవేగి :** ఏలూరు జిల్లా గౌడ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం శనివారం దెందులూరు మండలం గంగన్నగూడెంలో జరుగుతుందని గౌడ సంఘం నాయకులు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు చింతమనేని, పుట్టా మహేష్ పాల్గొంటారు.
- **జంగారెడ్డిగూడెం :** లక్కవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉండ్రాజవరపు గాంధీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సాయిల సత్యనారాయణ, గద్దె వెంకట సుబ్బారావు, కంబపు రామిరెడ్డి తదితరులు పరామర్శించి రూ.5వేలు అందించారు.
- **దెందులూరు :** యాదవుల ఆత్మీయ సమ్మేళనం గంగన్నగూడెంలో ఈ నెల 15న నిర్వహిస్తున్నామనిముమ్మడి సక్కు కుమారి, చింతయ్య యాదవ్ తెలిపారు. చింతమనేని ప్రభాకర్‌రావు, పుట్టా మహేష్‌యాదవ్ పాల్గొంటారాని, యాదవులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు,
- **పోలవరం :** బీజేపీ పోలవరం మండల ఎంపిటిసి సోమరౌతు అనిత కుమారి తనపై టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాయకులు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి తనను ఆహ్వానించలేదని, కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని వాపోయారు.
- పోలవరం గ్రామ దేవత కడమ్మ అమ్మవారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ అభ్యర్థి కావూరు లావణ్య, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వెల సృజనలకు గెలిపించడానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.
- **లింగపాలెం :** మండలం నుంచి పలువురు తెలుగుదేశంనేతలు ఏలూరులో బీసీ సమావేశానికి తరలివెళ్ళారు. గరిమెళ్ళచలపతిరావు, తాళం సోంబాబు, కొప్పెర్ల నాగరాజు ఆధ్వర్యంలో పలువురు తరలివెళ్ళారు.
- **ఉంగుటూరు :** భీమేశ్వరాలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరాలయంలో వార్షిక కల్యాణోత్సవం శనివారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తరఫున చోడే తాతయ్య చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.


రాజానగరంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న కామినేని శ్రీనివాస్


కైకలూరులో ప్రచారం నిర్వహిస్తున్న కామినేని సతీమణి మనోరమ


సమావేశంలో మాట్లాడుతున్న వంగవీటి రాధా(ఇన్‌సెట్) సత్కారం

అరాచక పాలన అంతం చేయాలి

»కైకలూరు బీజేపీ అభ్యర్థి కామినేని పిలుపు »కూటమితోనే రాష్ట్రానికి భవిష్యత్ అన్న వంగవీటి రాధా

ముదినేపల్లి, ఏప్రిల్ 12 : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకు యువత ముందుకు రావాలని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కొరగుంటపాలెం, ఈడేపల్లి, గోకినంపాడు, సీతారామపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజానగరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ నాయకులు యెర్నేని కిషోర్, వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, పోసిన పాండు రంగారావు, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, పరసా విశ్వేశ్వరరావు, సూర్య నారాయణ రాజు, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బాసినశెట్టి కిషోర్, మోటేపల్లి హనుమ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కామినేని శ్రీనివాస్ సతీమణి మనోరమ శుక్రవారం కైకలూరు 1వ వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కామినేనికి కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ప్రచారం చేశారు. డాక్టర్ కామినేని సురేఖ, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి భవిత

నూజివీడు: కూటమిని అధికారంలోకి తెస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. నూజివీడులో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశానికి ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ బటన్ నొక్కుడేంటో ప్రజలందరికి తెలుసన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా చేయిచేయికలిపి కూటమిని గెలిపించాల న్నారు. పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ సొంత బాబాయ్‌ని చంపినవారిని శిక్షించమని అడిగిన సొంత చెల్లికే సీఎం జగన్ న్యాయం చేయలేదన్నారు. అమరావతి రాజధాని చేస్తే చంద్రబాబుకు పేరు వస్తుందని, మూడు రాజధానుల పేరుతో జగన్ నిర్వీర్యం చేశాడన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాకపోతే రాష్ట్రానికి భవిష్యత్ లేదని, రాష్ట్రప్రజల ఆస్తులకు రక్షణ ఉండ దన్నారు. పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ పసుపులేటి జగన్, పట్టణ టీడీపీ అధ్యక్షులు జగదీష్, కౌన్సిలర్ విజయ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మాఫణిబాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీఆర్‌కె రంగారావు తదితరులు పాల్గొన్నారు. రాధాను పార్థసారథి తదితరులు ఘనంగా సత్కరించారు.

ముసునూరు: వైసీపీ ఐదేళ్లపాలనలో రాష్ట్రం అప్పులపాలై, అభివృద్ధికి నోచుకోక సర్వనాశనం అయిందని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి అక్కిరెడ్డిగూడెంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. భారీ ర్యాలీగా వారు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పార్థసారథి మాట్లాడుతూ జగన్‌రెడ్డి పనితీరుతో రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ళు వెనక్కి వెళ్ళిందన్నారు. సంపద సృష్టించాలన్నా, రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను చరమగీతం పాడకపోతే పేదలు బ్రతికే పరిస్థితి లేదన్నారు. సర్పంచ్ పులిబఖ్ఖ లక్ష్మీ సత్యనారాయణ, గ్రామపార్టీ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్, తెలుగుయువత నాయకుడు గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: నూగొండపల్లి, చిన్నాగిరిపల్లి, నరసింగపాలెం గ్రామాల్లో నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని, కూటమిని గెలిపించాలని కోరారు. నూజివీడులో ఆత్మీయ సమావేశానికి హాజరవుతున్న వంగవీటి మోహన్‌రంగా తనయుడు రాధాకు ఆగిరిపల్లిలో టీడీపీ కార్యాలయం వద్ద తెలుగుతమ్ముళ్ళు, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు.

కలిదిండి: ఎస్.ఆర్పీ అగ్రహారంలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో అందజేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షులు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, జనసేన ఆంధ్ర సెంట్రల్ కో-కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని మణుగూరు, కొవ్వాడలంక గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు అసెంబ్లీ అభ్యర్థి కామినేనికి కమలం గుర్తుపై, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. మూడు పార్టీల నాయకులు సజ్జ బాబి, మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, గజ్జల గణేష్, ముళ్లపూడి సత్తిబాబు, వీరవల్లి శివయ్య, గుడివాడ గణేష్, దేవమణి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సిద్ధార్థ జయకేతనం


సాయి మాధురి

నూజివీడు, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో నూజివీడు సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎంపీసీ విభాగంలో టౌన్ ఫస్ట్ సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీమన్నారాయణ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో టి.సాయి మాధురి 465, ఎం.ప్రశాంత్ 464, టి.గీతాసాయి, ఎం.మేఘన, ఏ.మధునయ్ 463, జి.స్వస్తిక 462 మార్కులు సాధించార న్నారు. సీఈసీ విభాగంలో పి.వెం కన్నబాబు 481, వై.రోజులిన్ 463 సాధించగా, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.మునీష్ కుమార్ 989, ఎం.నందిని, ఎస్.నవ్యలు 984, యూవీ ప్రవీణ్‌కుమార్ 983, వి.గంగ 982 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ మేడా మోహన్‌రావు, డైరెక్టర్లు తోటకూర సాంబశివరావు, మోరంపూడి సత్యనారాయణ, గొల్లపూడి రవిబాబు అభినందించారు.

శారద జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


కె. దేదీప్య

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో నూజివీడు శారద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ కుప్పాల శంకర్‌రావు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో కుప్పాల దేదీప్య సాయి 435 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిందని సంఘా హేమశ్రీ, పి.హరిప్రియ 429 మార్కులు సాధించారన్నారు. సెకండియర్ బైపీసీలో చామకూరి పూజిత 973 మార్కులు, బి.రూప 968, సీఈసీలో షేక్ నజీమ 965 మార్కులు సాధించారన్నారు. ఫస్టియర్ ఫలితాల్లో 400కు పైబడి 48 మంది మార్కులు సాధించారని, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 900కు పైగా 40 మంది మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కుప్పాల శంకర్‌రావు అభినందించారు.

చాట్రాయి వికాస్ విద్యార్థుల జయకేతనం


ఉషారాణి, తేజస్వి, సాయికిరణ్

చాట్రాయి, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో చాట్రాయి వికాస్ కాలేజి విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు యాజమాన్యం తెలిపింది. ఫస్టియర్‌లో 88 శాతం, ద్వితీయ సంవత్సరంలో 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎం. సాయికుమార్ (ఎంపీసీ) 470 మార్కులకు 447, ఎన్. ఉషారాణి (బైపీసీ) 440 మార్కులకు 415, జి. రామ్‌కుమార్(సీఈసీ) 500 మార్కులకు 368 సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో సీహెచ్ నాగ తేజస్వీ (ఎంపీసీ) 1000కి 978 మార్కులు, జి. అంజలి(బైపీసీ) 946 మార్కులు, వి. మహాలక్ష్మి(సీఈసీ) 810 మార్కులు సాధించారన్నారు. వీరిని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎన్. నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ రామ్మోహనరెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత ఇలా..

కైకలూరు, ఏప్రిల్ 12: కైకలూరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు 185 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి సంవత్సరం 94 మందికి గాను 32 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 91 మందికి గాను 48 మంది ఉత్తీర్ణులైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శాంతిజ్యోతి తెలిపారు. వీరిలో ఇంటర్ సెకండియర్ బైపీసీ విద్యార్థిని తేజస్విని 948 మార్కులు, సీఈసీకి చెందిన ఎం. మౌనిక 894 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీ గ్రూపులో వి. దుర్గానాగసాయి 425 మార్కులు, బి. హరికిరణ్ 404 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ముదినేపల్లి: ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 39 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 22 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 41 మంది హాజరు కాగా 15 మంది ఉత్తీర్ణులయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. అత్యధిక శాతం ఎంపీసీ గ్రూపులో ఫెయిలయ్యారు. ఈ గ్రూపు నుంచి ప్రథమ సంవత్సరం పరీక్షలకు 18 మంది హాజరు కాగా ఒక్కరు, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 11 మంది హాజరు కాగా ముగ్గురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

ఆగిరిపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ కూరపాటి యోహాను తెలిపారు. మొదటి సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 54 శాతం ఉత్తీర్ణత సాధించారని, ద్వితీయ సంవత్సరం బైపీసీలో హరితశ్రీ వెయ్యికి 857మార్కులు, ప్రథమసంవత్సరం బైపీసీలో లావణ్య 440కి 422 మార్కులు సాధించినట్లు తెలిపారు.

విధుల వేళల్లో మార్పు

ముదినేపల్లి, ఏప్రిల్ 12 : కాల్వలకు విడుదలైన నీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లించకుండా నిఘా నిర్వహించేందుకు నియమించిన టీముల్లోని గ్రామ సచివాలయాల మహిళా ఉద్యోగుల విధుల నిర్వహణ సమయాల్లో మార్పులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. "కాల్వ గట్లపై మహిళా ఉద్యోగుల పాట్లు" శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ముదినేపల్లి ఎంపీడీవో మురళీ గంగాధరరావు నీటి చౌర్యం జరగకుండా నియమించిన టీముల్లోని మహిళా ఉద్యోగుల డ్యూటీ సమయా లను సర్దుబాటు చేయాలని ఆయా పంచాయతీల కార్యదర్శులను ఆదేశించారు. మహిళా ఉద్యోగులను ఉదయం 6 నుంచి 2 గంటల వరకు డ్యూటీ సమయా లను కేటాయించే విధంగా సర్దుబాటు చేస్తామని ఎంపీడీవో తెలిపారు.


లోకుమూడిలో పంట కాలువ పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో, ఎస్ఈ

తాగునీటి చెరువులు నింపండి

మండవల్లి, ఏప్రిల్ 12: మండవల్లి మండల పరిధిలో పంట కాలువలను ఏలూరు జడ్పీ సీఈవో సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. లోకుమూడి పంచాయతీ పరిధిలో పోల్‌రాజ్ కెనాల్ నుంచి మంచినీటి చెరువులకు తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదలను పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకే ఈ నీటిని వాడాలని, ఎవరైనా చేపల చెరువులను నింపడానికి వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో ఆర్ జేబి శ్రీలక్ష్మీ, లోకుమూడి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో లంక గ్రామాలైన సంతోషపురం, భాస్కరరావుపేట, పెదలంక, మట్టగుంట గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను అధికారులు యుద్ధప్రాతిపదికన నింపుతున్నారు. సీబీ కెనాల్‌కు తాగునీటిని విడుదల చేయటంతో మూడు రోజులుగా ఆయా గ్రామాల్లో తాగునీటి చెరువులను మోటార్లతో నీరు తోడుతున్నారు. ప్రస్తుతం పెదలంకలో 70 శాతం, భాస్కరరావుపేట, మూల్లంక, మట్టగుంట, సంతోషపురంలో 50 శాతం తాగునీటిని చెరువుల్లో నింపినట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు.



పోల్‌రాజ్ కెనాల్‌పై మోటార్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఇన్‌సెట్) పెదలంకలో చెరువుకు నీటి విడుదల

ముదినేపల్లి: పోల్‌రాజ్ కెనాల్ ద్వారా ముదినేపల్లి మండలంలోని పంచాయతీల మంచినీటి చెరువులు, పశువుల చెరువులకు నీటిని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు మంచినీటి చెరువులను నింపేందుకు ప్రధాన కాల్వపై బ్రాంచి కాల్వల వద్ద ఇంజన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెనాల్‌లో ప్రస్తుతం కాల్వ శివారు గ్రామాల చెరువులకు నీరు వెళ్తున్నందున మరో రెండు రోజుల్లో ముదినేపల్లి మండలంలోని చెరువులకు నీరు సరఫరా చేస్తామని ఈవోపీఆర్డీ తెలిపారు.



కామినేనికి యాదవ సంఘీయుల మద్దతు

కైకలూరు, ఏప్రిల్ 12: ప్రజాసమస్యల పరిష్కారంలో తానెప్పుడూ ముందుంటానని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ముదినేపల్లి మండలంలోని 22 గ్రామాల్లో ఉన్న యాదవులు సుమారు 500 మంది వరహాపట్నంలోని కామినేని ఇంటికి వెళ్లి ఎన్నికల్లో తమ మద్దతు పూర్తిగా ఇస్తామని, తమకు ఏ సమస్య వచ్చినా ఆదుకోవాలని కామినేనిని కోరగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఒక్కసారి అధికారం ఇచ్చినందుకే రూ. 730 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. పుట్టి రాజా, జడ్డు సత్యనారాయణ, పుట్టి శివకుమార్, నగుల వెంకటేశ్వరరావు, బోయిన రాంబాబు, చిన కామనపూడికి చెందిన తలారి రామకృష్ణ, తదితరులు మద్దతు తెలిపారు.

కూటమిలో భారీ చేరికలు

ముదినేపల్లి, ఏప్రిల్ 12 : ముదినేపల్లి మండలం ఈడేపల్లి, కొరగుంటపాలెం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఎన్‌డీఏ కూటమిలో చేరారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సందర్భంగా కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు సమక్షంలో నాయకుడు ఏఎస్ బాబు, అన్నమనేని రత్న మాధవరావు జనసేనలో చేరగా, కొరగుంటపాలెంలో తూము రత్తయ్య, తూము రామకృష్ణ, శ్రీనివాస్, రవితోపాటు పలువురు యువకులు ఎన్‌డీఏ కూటమిలో చేరారు. గోకినంపాడుకు చెందిన నందమూరి రత్నం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరిని డాక్టర్ కామినేని, కమ్మిలి విఠల్ రావు పార్టీ కండువాలు కప్పి ఎన్‌డీఏ కూటమిలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులను టీడీపీ నాయకులు కొడాలి వినోద్, కొత్తూరు విఠల్ తదితరులు అభినందించారు.

వైసీపీకి తులిమెల్లి రాజీనామా

ముసునూరు, ఏప్రిల్ 12: ముసునూరు ఎంపీటీసీ-2 తులిమెల్లి కృష్ణకుమారి, మండల మాజీ యూత్ అధ్యక్షుడు తులిమెల్లి రంగారావు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేశారు. వైసీపీలో బీసీ, ఎస్సీ వర్గాలను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రాజీనామా పత్రాలను పార్టీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావుకు అందజేసినట్టు ఆయన తెలిపారు. త్వరలోనే తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని రంగారావు తెలిపారు.


మాట్లాడుతున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి

విద్యార్థులు ప్రతిభ చాటాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: టెక్నోఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభ చాటేందుకు సిద్ధంగా ఉండాలని, రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ వీసీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో టెక్ జెట్-24 జాతీయ స్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ నాణ్యమైన, విభిన్నమైన విద్యను అందిస్తోందని, మానవ సంక్షేమం కోసం నూతన విషయాలను ఆవిష్కరించటానికి విద్యార్థులు సాంకేతికతలో మార్పులను నేర్చుకుంటూ నూతన విషయాలను ఆవిష్కరిస్తూ ముందుకు సాగాలన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సాంకేతికతను, నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి టెక్నాలజీ రేసులో పరిగెత్తాలన్నారు. ఈ సందర్భంగా టెక్నో జెట్‌లో 1171 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నట్లు టెక్ జెట్ కన్వీనర్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్ తెలిపారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ టెక్‌జెట్‌లో 12 వర్క్‌షాపులతో పాటు 33 టెక్నికల్ ఈవెంట్‌లు నిర్వహిస్తామన్నారు. ప్రొఫెసర్ గోపాలరాజు, రిజిస్ట్రార్ బి.శ్రావణి, డీన్ బి.శ్రీనాథ్, ఫైనాన్స్ ఆఫీసర్ రత్నాకర్ పాల్గొన్నారు.

సక్సెస్ అంటే మార్కుల సాధనే కాదు..



ఆగిరిపల్లి, ఏప్రిల్ 12: మాదలవారి గూడెంలోని లింగయాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గౌహతి ఐఐటీ కెమికల్ ఇంజి నీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ రామ్‌గోపాల్ ఉప్పులూరి, విద్యార్థులకు జీవితంలో విజయంపై వివరించారు. సక్సెస్ అంటే మార్కులు సాధించటమే కాదని, పాజిటివ్ థింకింగ్ అవసరమని, భగవద్గీత ఆధారంగా జీవితాన్ని విజయ పథానికి తీసుకువెళ్ళాలని, స్వధర్మాన్ని పాటించమని, ఆలోచనలను క్రమబద్ధీక రించుకోవాలని, ఆహార అలవాట్లు మార్చుకోవాలని వివరించారు. ప్రిన్సిపాల్ రవీంద్ర కృష్ణ, హెచ్‌వోడి ఫణి శ్రీనివాస్, దిజమణిదాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఏప్రిల్ 12: కైకలూరు మండలంలో శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గుడివాడ ఎలక్ట్రికల్ ఈఈ కె. రామకృష్ణ తెలిపారు. పెంచికలమర్రు, పెదకొట్టాడ, చిన్నకొట్టాడ, రాజులకొట్టాడ, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, లక్ష్మీపురం, శృంగవరప్పాడు, గుమ్మళ్ళపాడు, జంగంపాడు, వడ్లకూటితిప్ప, గోకర్ణపురం గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిర్వహించేందుకు సరఫరా నిలిపివేస్తున్నట్టు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు యాదవ ఆత్మీయ సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 12: కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో శనివారం సాయంత్రం 5 గంటలకు నియోజకవర్గ యాదవ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకుడు బీకేఎం నాని తెలిపారు. నియోజకవర్గంలోని యాదవులంతా పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో పాటు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు.

తెలంగాణ మంత్రి తుమ్మలను కలసిన బసవారెడ్డి



చాట్రాయి, ఏప్రిల్ 12: తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగ్రామం గండుగలపల్లిలో శుక్రవారం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మండపాటి బసవారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మల మంత్రిగా పనిచేసినప్పుడు చాట్రాయి నాయకులతో పరిచయాలు ఉన్నాయి. ఏపీలో తాజా రాజకీయ పరిస్థితులపై మంత్రి తుమ్మల అడిగి తెలుసుకున్నారని బసవారెడి చెప్పారు.

ఎన్నికల అధికారులకు ఆర్వో శిక్షణ



కైకలూరు, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు తమ విధుల పట్ల పూర్తి అవగాహన కల్గి ఉండాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్ అన్నారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కైకలూరు నియోజకవర్గ పీవో, ఏపీవోలకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా అప్పటికప్పుడు దానిని అధిగమించేలా పీవో, ఏపీవో కీలకంగా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ కావాల్సిన వారు ఫారమ్-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కైకలూరు, కలిదిండి తహసీల్దార్లు ఎస్. పోతురాజు, డి. వంశీ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచుకోవాలి: ఎంఈవో

కలిదిండి, ఏప్రిల్ 12 : విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచు కోవాలని ఎంఈవో ప్రభాకర్ బాబు అన్నారు. శుక్రవారం టోఫెల్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు ఉపాధ్యాయులు కృషి చే యాలన్నారు. టోఫెల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ నుంచి టోఫెల్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి, ఏప్రిల్ 12: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బొమ్మినంపాడులో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సేంద్రియ విత్తనాల తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు మధు, కాంతమ్మ, మండల ఇన్‌చార్జ్ గౌతమ్ కుమార్ చిరుధాన్యాలను ప్రకృతి వ్యవసాయంపై వివరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడే ప్రకృతి వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలని కోరారు.

క్రైం కార్నర్

గాయపడిన మహిళా కూలీ మృతి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 12: గత నెల 26న జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలు మృతి చెందిన విషయం విదితమే. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బడుగు శివమ్మ (32) చికిత్స పొందుతూ అవుటపల్లి పిన్నమనేని ఆసుపత్రిలో శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనధికార మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 26 అనధికార మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ సీఐ వెంకట రమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన దాడుల్లో చిన్నంపేటకు చెందిన శ్యామల వెంకటేశ్వరరావు అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుంచి మొత్తం 26 మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. అలాగే నూజివీడు మండలం సిద్ధార్థనగర్ తండాలో నిర్వహించిన దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నామన్నారు. రేగుంటలో 50 లీటర్ల సారా ను స్వాధీనం చేసుకుని వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు తెలిపారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పార్థసారథి



నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: రహదారి ప్రమాదంలో గాయపడిన వ్యవసాయ కూలీలను తెలుగుదేశం పార్టీ నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆసుపత్రికి పంపించారు. ఆగిరిపల్లి మండలంలో పర్యటనకు వెళుతున్న ఆయన కొన్నంగుంట వద్ద రహదారి ప్రమాదం జరిగిన విషయం గమనించి గాయపడిన ఇద్దరిని తన గన్‌మెన్‌ను ఇచ్చి ఆటోలో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఏరియా ఆసుపత్రి అధికారులకు సూచించారు.


శ్రీరామాలయంలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కైకలూరు, ఏప్రిల్ 12: రామాలయం జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వేమవరప్పాడులో ఘనంగా నిర్వహించారు. కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనను పుట్టా మహేష్ ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున విచ్చేశారు.

20న రఘునాథస్వామి కల్యాణం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: నూజివీడు మండలం గొల్లపల్లి రఘునాథ స్వామి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 20న వైభవంగా నిర్వహించనున్నట్టు దేవదాయ ధర్మదాయశాఖ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ప్రసిద్ధ యదుపురి క్షేత్రంలో కల్యాణ మహోత్సవాలను ఈ నెల 17 నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 17వ తేదీ స్వామివారిని పెండ్లికుమారుడిని చేయటం, 20వ తేదీ రాత్రి 9 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని, 21వ తేదీ స్వామివారికి ఊంజలసేవ, హనుమంతవాహనంపై గ్రామోత్సవం, 22న రథోత్సవం, 23న గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 24వ తేదీ శేషవాహనం పై గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికం


తలంబ్రాలు దర్శించుకుంటున్న భక్తులు

భద్రాచలం నుంచి అందిన తలంబ్రాలు

చాట్రాయి, ఏప్రిల్ 12: తెలంగాణ రాష్ట్రం భద్రాచలం రామాలయం నుంచి అపర భద్రాద్రిగా పేరొందిన చనుబండ రామాలయానికి శుక్రవారం కల్యాణ తలంబ్రాలు అందాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, పూజారి మారుతి, కమిటీ సభ్యులు తలంబ్రాలకు పూజలు చేసి మూలవిరాట్ వద్ద భద్రపర్చారు. ఈ తలంబ్రాలను శ్రీరామనవమి నాడు జరిగే కల్యాణంలో వినియోగిస్తారు.

ఆలయంలో ద్వార స్థాపన



ముసునూరు, ఏప్రిల్ 12: ముసునూరులో వేంకటాచలస్వామి ఆలయ పునః నిర్మాణంలో భాగంగా ద్వార స్థాపన పూజను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దేవినేని భాస్కరరావు, రేగుల లోకేశ్వరరావు, దేవినేని రామకృష్ణ దంపతులతో పాటు మరో 19 జంటలు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. కాకతీయుల కాలంనాడు నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఆలయ నిర్మాణం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు.